కథానిక

# వైతరణి

అతను వంచిన ఉండేలుబద్దలా నడుస్తున్నాడు. దూసుకుపోతున్న బాణంలా నడుస్తున్నాడు. జేబులో సిగరెట్లు ఖాళీ అయిపోతున్నాయి. చేతిలో డబ్బులు ఖాళీ అయిపోతున్నాయి. అతను నడుస్తున్నాడు-వంచిన విల్లులాగా-వదిలిన బాణంలాగా.

ఖాళీ గాక ఏంజేస్తాయి? అక్షయపాత్రా కాదు, యక్షనిధీ కాదు, డబ్బాయిరి! దానికితోడు దే సిగరెట్టు. అలాటిదే బుర్ర. నడుస్తున్న వాడల్లా చూశాడు తలెత్తి: శరీరానికి అలవాటయిపోయింది; బస్సు ఆగేచోటనే ఆగడం. బస్సువచ్చింది. అతను ఎక్కాడు.

...దిగాడు. దిగి, నడిచివెళ్ళాడు-మేరుపర్వతమంత మనిషిఇంటికి-తాళప్రమాణం మనిషి ఇంటికి.

"ఆయన ఇంట్లో ఉన్నారా?"

బిడియపడుతూ, మెల్లిగా, పిల్లిలా అడిగాడు.

వాళ్ళ ఇంట్లో నల్లికి కూడా ఒంగి, ఒదిగి నమస్కారం పెడతాడు. అలాటివాడు అక్కడ కూర్చున్న-రీవిగా, కోరమీసంతో కూర్చున్న గుర్ఖావాడితో వినయంగా మాట్లాడకేం జెయ్యగలడు?

"ఆయన లోపల ఉన్నారా?"

"ఉన్నారు."—అమ్మయ్య.

"కాస్త నేను వచ్చానని..."

గూర్ఖావాడు రీవిగా నడిచాడు; యుద్ధ సైనికుడిలాగ.

ఇతను ఇంకా వంగిపోయాడు.

"కాస్తసేపట్లో పిలుస్తారు-కూచోమన్నారు."

చంకలో కాగితాలకట్టతో, లోపలికి వెళ్ళి బల్లమీద కూచున్నాడు. ఇంట్లోంచి ఏవేవో చప్పుళ్లు వినిపిస్తున్నాయి. కాఫీకప్పుల చప్పుళ్ళు అతని కడుపులోపల ఏదో ఆకలిలాటి చలనం ప్రారంభం అయి చాలా సేపయిందని జ్ఞాపకం వచ్చింది. అప్పుడు తను ఏంచేస్తాడు.. నెలాఖరు రోజులబరువుతో క్రుంగిపోతున్నాడు. జేబులో రెండణాలే మిగిలాయి. ఈయన 7-30కి రమ్మన్నారని చాలా ఆలస్యంగా జ్ఞాపకం వచ్చింది. ఆ రెండణాలూ పెట్టి కాఫీతాగాలా? బస్సుమీద పోయి టైముకి అక్కడ ఉండాలా? ఎప్పుడో చదువుకున్న అర్థశాస్త్రంలో Wants are Competetive అని ఉండడం జ్ఞాపకంవచ్చింది. ఆ రోజులు జ్ఞాపకం రావడంతో అతనికి ఏదో భయంకరమైన చిరునవ్వు వచ్చింది-ఆ రోజులు.

"అతన్ని లోపలికి రమ్మను." అన్న మాటలతో ఈ స్మృతులు కట్టిపెట్టి ఫైలు చంకలో పెట్టి వంగుతూ లోపలికి వెళ్ళాడు.

ఆయన-అంత పెద్దమనిషి - ఫైలు విసుగ్గా విప్పుతూ, "ఏమయ్యా 7-30 అంటే సరిగ్గా 7-30కే సిద్ధంకావాలా? దయ్యంలాగా."

గబగబా చూడడం ప్రారంభించాడు.

"ఏమిటిది-నే నే ఫైలు తెమ్మన్నాను, ఏమిటి తెచ్చావు?"

అతను కంగారుపడి చూశాడు.

"ఇదేనండి"...నోటమాట పూర్తిగా రాలేదు.

"పైగా దబాయిస్తావా? లారీ కంపెనీ కాగితాలు కాదటయ్యా అర్జంటు-నిన్న ఇంటికి రమ్మన్నదెందుకు? నీ బుర్ర సరిగ్గా పనిచెయ్యడం లేదు! లాభం లేదయ్యా!"

ఇతను-నీరైపోయి, గడ్డకట్టుకుపోయి, నిర్జీవంగా రాయైపోతున్నాడు. ఆయన ఫైలు మొహంమీద పారేసి లేచిపోయాడు ఫో-అంటూ. ఇతను నీరసంగా కూలబడిపోయాడు. ఆ మహా పర్వతం ముందు పరమాణువులాంటి మనిషి. "ఊఁ పోయి ఆఫీసులో కనపడు. అదేదో చూడొచ్చు-ఇంతకన్నా నీకు చేతనయిందేముంది."

వి. నారాయణరావు

చాలాసేపు పోయాక జ్ఞాపకం వచ్చింది అతనికి-రోడ్డుమీదికి వచ్చాశాడని. ఏమిచెయ్యాలో తోచక తికమకపడుతున్నాడు. ఏది చెయ్యవలసినదో అది చెయ్యకపోయినందుకు వికావికలౌతున్నాడు. ఆయన అడిగిన ఫైలు ఇదే. ఆరోజు సాయంత్రం చూచిన ఫైలూ అదే. ఇంటికి తెమ్మన్నదీ ఇదే. తనదెంత మందబుద్ధి అయినా. ఆయన పెద్దవాడు. చాలా పే...ద్దవాడు. ఎన్నో మాటలనగలడు. అవును అవన్నీ ఆయన అనాలి. కాని-ఏ ఒక్కరోజయినా ఆయన అవన్నీ అనకపోతే బాగుండును. కాని, అలాంటి రోజేదీ. ఇవాళ ఇంటికి రమ్మన్నాడు కదా-పీలు చూచుకుని ఇవేళేనా చెప్పేద్దామనుకున్నాడు. ఆ సంగతి కాస్తా జీతం ఎక్కువచెయ్యమని-కాని ఈరోజు ఇంకా అధ్వాన్నంగా తయారయింది. అవును-"రాంగ్" తన బుర్రలో ఏదో ప్రమాదకరమయిన లోపముంది. ఆ మాట అంతా అన్నారు. ఈయనా అన్నాడు. ఇంతమంది అనగా అనగా తనూ అనుకున్నాడు. ఇంక తను ఎవరికోసం ఈ బతుకంతా గడుపుతున్నట్టు- ప్రయోజనకరమైన ఆయనలాంటివాళ్ళు, మేడలవాళ్ళు, కార్లవాళ్ళు టెలిఫోన్ నంబర్లవాళ్ళు, బ్యాంక్ ఎకౌంట్లవాళ్లు; బతకాలి. వాళ్ళవల్ల దేశానికి బోలెడు ప్రయోజనం. తనెందుకు, తనకీ, తనవాళ్ళకీకూడ ప్రయోజనంలేనివాడు. రాంగ్ తన బుర్రలోపలా బయటా—అంతా—రాంగ్.

బస్సువచ్చేస్తోంది. ఆలోచనలు ఆగిపోయాయి. బస్సు ఆగింది. ఎక్కేశాడు. 'రైట్' అన్నాడు కండక్టరు.

'రాంగ్'అన్నాడు అతను.

గొల్లుమని నవ్వారు జనం.

ఏమిటి వీళ్ళంతా అలాచూస్తారు? రైట్ అంటాడేమిటి-ఈ కాకీబట్టల కండక్టరు. వీడికి ఆయనకన్నా ఎక్కువతెలుసేం? రాంగ్-ప్రపంచమంతా రాంగ్-ప్రతిమనిషీ చేసేదీ, చూసేదీ, ఆలోచించేదీ అంతా రాంగ్. మనుషులు బతకడమే పెద్ద రాంగ్. రైట్ ఏమిటి వీడి మొహం..

టికెట్స్...స్...స్...స్... అనుకుంటూ వచ్చాడు కండక్టరు. ఆలోచనలు ఆపి, జేబులోకి చెయ్యిపోనిచ్చాడు. డబ్బులు తగల్లేదు. తన తలకాయ! డబ్బులు ఇందాకనే అయిపోయాయి. అర్థణా కాబోలు మిగిలింది. తెల్లమొహంపెట్టాడు. దిగమన్నాడు కండక్టరు, దిగిపోయాడు. "పిచ్చివాడు"అన్నారు లోపల జనం.

బస్సు వెళ్ళిపోయింది. ఆకాశంకేసి చూశాడు. అమాయకంగా, ప్రశ్నార్థకంగాచూసింది ఆకాశం. నీకుమాత్రం ఏంతెలుసులే; నాలాగే నవ్వావు. నీకింద నిత్యం జరిగేవాటినన్నిటినీ చూసిచూసి, నల్లబారిపోయావు నువ్వుకూడా- అనుకున్నాడు. ఎదురుగుండా బస్సు ఆగేచోటుని చూపించే గుర్తు కనిపిస్తోంది. ఇంకోదగ్గిర బడిపిల్లవాడి గుర్తువేసిన స్తంభం ఉంది. జేబులు తడుముకున్నాడు. అర్థణా దొరికింది. సిగరెట్టు కొన్నాడు. సావకాశంగా సిగరెట్టు వెలిగించాడు...నయం తన్నలేదు కండక్టరు-డబ్బుల్లేక బస్సెక్కినందుకు.

కడుపులో నీరసంగా ఉంది. నాలుగువేపులా కలయజూచాడు. ప్రతివాడి ముఖమూ ఒకలాగే కనిపిస్తోంది. అందరి కళ్ళల్లోనూ లోతుగా గూడు కట్టుకున్న ఆవేదన, బాధ. అందరూ తనలాగే ఉన్నారేమో!

"బాబూ...కానీ."

ఎవడో అడుక్కుంటున్నాడు. తనదగ్గర కూడా అడుక్కునే వాడున్నాడా ఈ ప్రపంచంలో...అతనికి నవ్వువచ్చింది—మరోసారి.

బస్సులు బయ్‌మంటున్నాయి. టైము గడిచిపోతోంది. ఆఫీసుకి వెళ్ళిపోవాలి. బస్సెక్కడానికి డబ్బుల్లేవు. నడిచివెళ్ళాలనుకుంటున్నాడు. వర్షంవచ్చేలా ఉంది. నడిచివెళ్తే తడిసిపోతాడేమో! అయినా తడిస్తే-మొక్క మొలవదుకాని, బట్టలు తడిసిపోతాయి. ఇంక మళ్ళాలేవు, ఇవి తప్పిస్తే. ఏమిటో వెధవబతుకు, ఎందుకొచ్చిన కాళ్ళడపు, ఎవరిని ఉద్ధరించడానికి, ఎవరిని సంతోషపెట్టడానికి కోటానుకోట్లమందిలో తను లేకపోతే వచ్చిన నష్టం ఏమిటి?—ప్రపంచానికి. ఈ ఆలోచనలు కట్టిపెట్టెయ్యాలి. మంచిరోజులు బలితుండగా రావు. గడవదు. ముందుంది-ముసళ్ల పండుగ. ఇవేళటిదాకా కొంతేనా డబ్బుంది. ఇక నెలాఖరుదాకా-చేతిలో కానీలేకుండా గడపాలి. అప్పుడు నడవకేంచేస్తాడు?

"బాబూ! ఒక్క కానీ..."

ఈసారి ఓ చిన్న కుఱ్ఱాడు వచ్చాడు. నల్లగా, పొట్టిగా ఉన్నాడు. బొడ్డుపైకి, బొజ్జమీది జారి పోతున్న లాగు లాక్కుంటున్నాడు. వెధవ-చిట్టి నోరూ వాడూ-బాబూ అంటున్నాడు—జాలిగా. ఇంత ఈడునించీ వీడికి ఈదశపట్టింది పాపం. వీడికి సంబంధించినవాళ్లెవరూ అక్కడఉన్నట్టు లేదు. అప్రయత్నంగా జేబులో చెయ్యిపెట్టాడు-కానీ లేదు. "లేదు నాన్నా" అన్నాడు. కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. వాడికి బాధే ఉన్నట్టు లేదు. వెళ్లిపోయి ఇంకో సూటు వేసుకున్నాయనని అడిగాడు. ఒకటికి రెండుసార్లడిగాడు. ఆయన పొమ్మని కసిరాడు. అందుకూ బాధపడలేదు వాడు. వెనక్కి తిరిగాడు. అక్కడో రిక్షావాడున్నాడు. వాడు కాసిని నీళ్లు తెచ్చిపెట్టమన్నాడు. వాడిదగ్గరో డాల్డా డబ్బా ఉంది. అది పుచ్చుకున్నాడు. పంపు రోడ్డవతల ఉంది. అక్కడికి గెంతుకుంటూ వెళ్ళాడు. డబ్బానిండా నీళ్లు పడుతున్నాడు. ఈలోపుగా ఆట-కాళ్ళతో పంపుకింద నిలచిన నీళ్లని తంతున్నాడు. డబ్బా నిండింది. మొయ్యలేక, పొట్టమీద ఆనించి మోసుకొస్తున్నాడు. రోడ్డు మీంచి కార్లు దూసుకుపోతున్నాయి. వీడు తొందరగా దాటుతున్నాడు. రోడ్డు పొడుగునా నీళ్లు పోసుకుంటూ, లాగంతా తడుపుకుని-అలా పట్టుకొచ్చాడు. బహుశా వాడికి అదొకటే లాగు అదేనా చిరిగిపోయింది. వాడికి చాలా పెద్దది. మోకాళ్ళదాకా వచ్చింది. అది తడిసిపోయిందన్న చింతలేదు. తిన్నగా ఆ డబ్బా నీళ్ళు రిక్షావాడికిచ్చాడు. వాడు ఆ డబ్బా నీళ్ళు తాగేశాడు తృప్తిగా. వాడు తాగుతున్నంతసేపూ తలకాయ ఒకపక్కకివంచి, ఆశ్చర్యంతో వాడికేసి చూస్తున్నవాడల్లే నిలబడ్డవాడల్లా, వాడు తాగడం పూర్తవగానే అమాయికంగా గిర్రున వెనక్కి తిరిగి జనంలో పడ్డాడు. ఎందుకో రోడ్డవతలకి పరుగెత్తాడు. తిన్నగా అవతల పేవ్మెంటు మీదనించి వచ్చేస్తున్న ఒక అమ్మాయి దగ్గిరకెళ్ళాడు. చేతులు చిత్రంగా ఆడించుకుంటూ, తలకాయపైకెత్తి నవ్వుతూ, 'కానీ'—అన్నాడు. తొందరగా వెళ్ళిపోతున్నట్టు కనిపించిన ఆవిడ—ఆగింది—నవ్వింది. చేతిలో బోలెడు పుస్తకాలున్నాయి. ఆ పుస్తకాలన్నిటిపైన ఒక చిన్న పెట్టెవుంది. అందులోంచి కానీ తీసింది. ఇంతసేపటినుంచీ ఆతురతతో ఎదురు చూస్తున్న వాడి చేతిలో కానీపెట్టి-వంగి-ఆప్యాయంగా ఏమిటో అంటోంది. వాడు అంగీకారసూచకంగా తల ఊగిస్తున్నాడు-కానీకేసి చూసుకుంటూ. తను వాళ్ళకి చాలా దూరంగా ఉన్నాడు కాబట్టి వాళ్ళమాటలు వినిపించవు. కాని వాళ్ళేమిటి మాట్లాడుకుంటున్నారో వాళ్ళ ముఖ భంగిమలు బట్టి ఇట్టే తెలుస్తుంది.

ఆమె తర్జనితో బెదిరిస్తూ అంటోంది-

నీకు కానీ ఇచ్చానని ఇంకెవ్వరితోనూ చెప్పకుమా- ఆ కుఱ్ఱాళ్ళంతా వచ్చేస్తే నాదగ్గిర కానీల్లేవు.

వాడు సరేనని ఒప్పేసుకున్నాడు.

ఆమె వెళ్ళిపోయింది గబగబా నవ్వుకుంటూ.

ఈకుఱ్ఱాడు చేతిలో కానీ మరోసారి చూచుకొనైనా లేదు. తిన్నగా తన ఎడంచేతిపక్కనున్న కిళ్లీకొట్టులోకి వెళ్ళాడు. కానీ ఇచ్చేసి-ఏదో కొనేసుకున్నాడు. తినుకుంటూ చక్కావచ్చాడు.

ఇదంతా చూస్తూ నిలబడ్డ అతను ఈలోకంలో లేడు. అతనికి అప్రయత్నంగా నవ్వొచ్చింది ఆ కుఱ్ఱాణ్ణి చూడగా. వాడు పట్టికుఱ్ఱాడు. కష్టపడి అడుక్కుని సంపాదించిన కానీ, వాడు క్షణమైనా ఆగకుండా ఏదో కొనుక్కుని తినెయ్యడం-అతనికా దృశ్యం ఎంత హాయిగానో ఉంది. వాడికి ఆలోచనలు లేవు. ఎవరేనా తిట్టి పొమ్మన్నారని బాధలేదు. ఎవరేనా ఇస్తే-ఆ కానీకి రెండుమూడు వినియోగాలున్నాయన్న చికాకు లేదు. ఎవరూ ఇవ్వకపోతే చింతేలేదు. ఎప్పటికప్పటికి, ఏమీ ఎరగనట్టు, ఆ చిరు బొజ్జమీదికి చిరుగు లాగూ లాక్కుంటూ, హాయిగా ఉన్న ఆ పిల్లాడిని చూసేటప్పటికి అతనికి ఎప్పుడూ, ఎన్నడూ ఎరుగని సంతోషం కలిగింది. హృదయమంతా విశాలమైన నవ్వునవ్వింది. ఆ కాస్తసేపు అతనేదో అలౌకికమైన ప్రపంచంలో ఉన్నాడు. ఆ కుఱ్ఱాడు ప్రపంచంలో చాలా సౌఖ్యంగా ఉన్నవాళ్ళలో ప్రథముడు. మిగతావాళ్ళకి వీడికి లేనివి చాలా ఉన్నాయికాని, వీడికున్న హాయి లేదు.

ఆ కుర్రాడికేసీ, వాడి నవ్వుకేసీ, నిశ్చితంగా పిచ్చిప్రపంచంకేసి వెళాకోళంగా చూస్తున్న వాడి కళ్ళకేసి- చూస్తూ నిలబడిపోయాడతను. అతనిముఖంలో చిరునవ్వు ముద్ర అలా నిలచిపోయింది.

బయ్యమనిపించింది బస్సు హారను. చక్కమని గెంతాడు కుర్రాడు. గప్పున ప్రపంచంలోకి వచ్చాడతను ఎదురుగుండా టవరు గడియారం ఆఫీసుటైము దాటిపోయిందని చూపించింది.

అతనికి ఆలోచించుకుంటూ, నిలుచునేందుకు వ్యవధిలేదు. బయలుదేరాడు. వెనక్కి తిరిగి ఆ కుర్రాణ్ని చూడకుండా ఉండలేకపోయాడు. ఆఫీసుకి ఆలస్యంగా వెళ్తున్నాడన్న జ్ఞానంలేదు. ఇంక ఏ ఇతర చింతాలేదు.

అతను గంగలో అప్పుడే స్నానంచేసిన మనిషిలా స్వచ్ఛంగా ఉన్నాడు-పులుగడిగిన ముత్యంలా నవ్వుతుంటున్నాడు- సముద్రపు నురగలా సుడులు తిరుగుతున్నాడు.

అతను నడుస్తున్నాడు, వంగిన ఉండేలు బద్దలా, వదిలిన బాణంలా.

* * *

అతను నడుస్తున్నాడు. వంగిన ఉండేలుబద్దలా కాదు, దూసుకుపోతున్న బాణంలా కాదు. మెల్లిగా, ప్రతి అడుగూ భారంగా. చంకలో ఫైలులేదు. ఏదో పుస్తకం కాగితాలూ ఉన్నాయి. జుట్టు మునపటికన్నా శుభ్రంగా దువ్వి ఉంది. బట్టలు ఇస్త్రీమడతలు. కాళ్ళకి ఈసారి జోళ్ళున్నాయి. దగ్గరగా వెళ్ళి చూస్తే ఈమార్పు బహిరాకారములోనే అని బోధపడుతుంది. మొహం లోపల ఏ మార్పూ లేదు. ఎప్పటి ఆలోచనలూ ఎప్పటి వేగంతోనూ మనస్సుని వ్యధపెడుతున్నాయి. కాని అతనెందుకు మెల్లిగా నడుస్తున్నట్టు?

అవును. తనెందుకీ పనిచేసినట్టు, ఈ కొత్త ఉద్యోగానికి ప్రయత్నంచేసే పని తనకెవరు చెప్పారు? తనేమంత తగినవాడని ప్రయత్నం చేశాడు? చేస్తున్న చచ్చుఉద్యోగంలోనే తెల్లవారితే లక్ష తప్పులు, లక్ష చీవాట్లూ. ప్రతివాడూ తనని పనికిరానివాడనికి తిటినవాడే. ఎన్నిగుండెలతో ప్రయత్నంచేశాడీ ఉద్యోగానికి!

అది ఆరోజు మహత్యం. ఆవేళ- ఆ కుర్రాడిని చూసిన రోజున, జీవితంలో ఎన్నడూ ఎరగని ఉత్సాహం వచ్చింది. తమూ మనిషేనన్నంత ధీమా వచ్చింది. కొండలు పిండికొట్టెయ్యగలనన్నంత ధైర్యంవచ్చింది.

తన రూములో సహవాసి విక్రమ్-ఈ కాస్తనలుసంత విశ్వాసానికీ, ధైర్యానికీ ఊపిరిపోశాడు. ఇంకా-పెద్దదిచేశాడు. ప్రపంచమంతా తనదేనని అనిపించింది ఆ రోజున ఏమిటో విక్రమ్-భలే గమ్మత్తయినవాడు - అతని కొక్కడికే తనుచేసిన పనులు బాగుంటాయి. అతని మాటలలో తను ఆవేళ ఎంత మారిపోయాడు! తను కొద్దిరోజుల్లో మంచి ఉద్యోగం సంపాదించుకుంటాడు. ఒకరి మాట పడనక్కరలేని ఉద్యోగం. జీవితం అంతా హాయిగా నీలమేఘాల జరీ అంచులమీద విహారంలా నడుస్తుంది.

ఆ ఉత్సాహమే అతనిచేత ఇంతపని చేయించింది. ఆ ఉద్యోగానికి అర్జీపడేశాడు. అందరితో పాటే తనకీ ఇంటర్వ్యూ వచ్చింది. ఇంటర్వ్యూకి పోవడమంటే మాటలామరి! పట్టి మూడోరకం గుమాస్తా ఉద్యోగం చేస్తున్న-నాలుగోరకం మనిషిలా వెళ్తే ఎలా? విక్రమ్ సలహా పాటించాడు. అందుకన్న తన జీతంలో మూడోవంతు ఖర్చుపెట్టి- ఒక పంట్లాం కొన్నాడు - ఒక బూటు కొన్నాడు. ఇవన్నీ వేసుకుని ఇంటర్వ్యూకి బయలుదేరేదాకా అతను చాలా ఉత్సాహంగా ఉన్నాడు. తనని చూసుకుని తనేమురిసిపోయాడు. ఇంటర్వ్యూ అయిపోగానే ఆఫీసుటైము అయిపోతుందేమో-వీలయితే వెంటనేవెళ్ళి, ఫలితం విక్రమ్‌కి చెప్పేద్దామనుకున్నాడు. పాపం విక్రమ్‌కి యీగొడవలేవీపూర్తిగా తెలియవు. అతనేమీ చదువుకోలేదు. చదువుకుని తను సుఖపడ్డాడు కనకనా?

చివరికి ఇంత ఉత్సాహమూ ఏమయింది? అంత ఎత్తు ఎగరనేకూడదు. కిందనే ఉంటే ఏ బాధాఉండదు. తననే మొదట పిలిచారు. మాంచి హుషారుగా లోపలికి వెళ్ళాడు. ఎదురుగుండా కూర్చున్న మనుషుల్ని చూచేసరికి—అమాంతం శిలలా స్తంభించి పోయాడు. వాళ్ళల్లో మధ్యనున్నది—"ఆయన" ఆమేరువుపర్వతమంత మనిషి-తాళప్రమాణం మనిషి ఇంకేముంది! తన

సంగతి ఆయనకి తెలియనిదేముంది. నోటమాట పెగిలిరాలేదు. ఆయన నిప్పులుకక్కినట్టు మాట్లాడతాడేమోనని భయపడిపోయాడు. ఆయన అన్న ప్రతి మాటలోనూ ఆ వాడి, వేడిఉన్నాయి.

ఫలానాచోట పనిచేస్తున్నావా?

వాళ్ళ అనుమతితోనే ఇక్కడికివచ్చావా?

అక్కడ నిన్నుగురించి మంచి అభిప్రాయం ఉందా?

ఈ మాటలకి జవాబులు ఆయనకి తెలుసు. ఇంక మిగతావేవీ అతనికి వినపడలేదు - అతని మనస్సులో ఎన్నో సముద్రాలు ఘోషపెడుతున్నాయి. బయటి మనుషుల భాష అతనికి వినపడదు.

అంతే—బయటికి వచ్చేశాడు. నల్లటి తారు రోడ్డు - మునపటిలా తనశరీరాన్ని అప్యాయంగా తాకడానికి వీలులేకుండా ఈ బూటొకటి. బుర్ర ఇంచుమించు పనిచెయ్యడం మానేసింది. కలలోలా ఆ దృశ్యమే కళ్ళముందు తిరుగుతోంది. ఆయన మొహం చూసేటప్పటికి నరాలు స్తంభించి పోతున్నాయి. రక్తప్రవాహం ఆగిపోతోంది. అతనికే ఆశ్చర్యం - ఎంత సాహసం! తనలాటివాడు అలాటి ప్రయత్నం చెయ్యడం.

"ఇపుడింక ముందుసంగతి?" అతనికి ఈసారి ఈ ఆలోచన భయం, వణుకు పుట్టించింది. తల కిందికివంచి చూచుకొంటున్నాడు. జోడు, పట్లాం,- నెలలో మూడొంతు రోజులు ఇంచుమించు ఉస్తుండాలి. మామూలుగా నే నెలాఖరు రోజులు బండరాళ్ళంత బరువుగా గడుస్తాయి. కేలెండరులో ఆ రోజులు లేకపోతే-! తనుకట్టి అసమర్థుడు. జీవితంలో ఉన్న కష్టాలకి


# ఆంధ్ర బ్యాంక్, లిమిటెడ్

(స్థాపితము—1923) హెడ్డాఫీసు : మచిలీపట్టణము

చెల్లింపబడిన మూలధనము, రిజర్వులు కలిసి మొత్తం—రు. 37,41,000

అమలులోనున్న వ్యాపారం మొత్తం—రు. 7,00,00,000 లకు మించినది.

చైర్మన్. శ్రీ ఎస్.ఆర్.వై. శివరామప్రసాద్ బహదూర్ గారు, చల్లపల్లి రాజాసాహెబ్.
డెప్యూటీ చైర్మన్ శ్రీ జల్లు మాణిక్యాలరావుగారు, మచిలీపట్టణము.
మేనేజింగ్ డైరెక్టర్. శ్రీ తాడేపల్లి శ్రీరాములుగారు, మచిలీపట్టణము.

మద్రాసు బ్రాంచీలు:
- 322-23, లింగిచెట్టివీధి, మద్రాసు-1.
- 87, త్యాగరాయరోడ్డు, త్యాగరాయనగర్, మద్రాసు-17.
- 77, కచేరీరోడ్డు, మైలాపూర్, మద్రాసు-4.

కర్నూలు ఆఫీసులు.
- 1/9 మెయిన్‌బజారు, పేట.
- లెజిస్లేచర్ సెక్రటేరియట్ పే ఆఫీసు. (అసెంబ్లీ సెషన్సు జరుగుతున్నంత కాలము మాత్రమే.)

ఆంధ్రరాష్ట్రమంతటా, బళ్ళారిలోను బ్రాంచీలు సబ్ ఆఫీసులు కలవు.
అన్ని రకముల డిపాజిట్లు ఆకర్షణీయమైన వడ్డీరేట్లకు తీసుకొనబడును.
అన్ని రకముల బ్యాంకింగు వ్యాపారములు చేయబడును.
లండన్ ఏజంట్లు: బార్క్లేస్ బ్యాంకు లిమిటెడ్.
వివరములు బ్యాంకుయొక్క ఏ ఆఫీసులోనైనను తెలుసుకొనవచ్చును.

**ఏలేశ్వరపు రామచంద్రమూర్తి**, ఎం.ఏ., సి.ఏ.ఐ.ఐ.బి., జనరల్ మేనేజరు.

తోడు మరోకొన్ని తెచ్చుకుంటాడు. అంతే బతుకంతా ఇలా నీరసంగా గడవాలిసిందే కాబోలు.

అంతేకాదు. అయిన ఖర్చేదో అయింది. ఆదేనా రాణించే ఖర్చుకాలేదు. తనకు చేతనవునా? ఏడుపా? షాపులో చూచేటప్పుడు చాలా అందంగా కనిపించింది జోడు. తీరా తొడుక్కుని కొన్నిగంటలు నడిచేసరికల్లా అంతా ముడతలు ముడతలు పడిపోయింది. అయినా విచారించలేదతను. కాని ఇప్పుడింకో పెద్దబాధ ఒకటి వచ్చింది. ఆ జోడు సైజు చిన్నది. తప్పు పనే జరిగింది-కొనడంలో తొందరలో.

ఇప్పుడు తెలుస్తోంది బాధ. ప్రతి అడుగూ యమలోకం చూపిస్తోంది. కాలంతా నొక్కుకు పోతోంది. నరనరం తోడుకు పోతోంది.

ఇంత విలువైన డబ్బు పెట్టి చివరికి తనేం సాధించబోయినట్టు. మనస్సులో ఒక బాధ-శరీరానికి మరోకబాధ. చివరికీజోడుకూడా వదిలి పెట్టెయ్యవలసిన స్థితి వస్తుంది. అయినా వేసవి కాలమంతా కాలుతున్న తారురోడ్లమీద వట్టి కాళ్ళతో తిరిగిన వాడికి ఇప్పుడు జోడేమిటి? ఏమో - సాగుతుందేమో కొద్దిరోజుల్లో, కాని ఇప్పుడు తను సాగిపోతున్నాడు; ఈ బాధతో. తను ఇలా బాధపడడానికే పుట్టాడు. మధ్యలో సుఖపడాలనే తాపత్రయంవల్ల మరింత వ్యథ.

బహుశా ఆఫీసుటైముకూడా అయిపోయి ఉంటుంది. ఇంక అక్కడికి వెళ్ళేక ఉంది...

"ఆయన-"... ఎన్ని మాటలంటాడో. ఈ ఆ కారంతో వెళ్తే ముందు తోటివాళ్ళే ఎగతాళి చేస్తారు. అతనికి ఏదో అంతుతెలియని, నిరాశ, నిస్సహాయత కారణంగా పెద్దనిట్టూర్పు వచ్చింది. బతుకుమీద విపరీతమైన విసుగు, ఆ పెద్ద ఊర్పుకి అంతబలం ఇచ్చింది. నీళ్ళల్లో మునిగిపోతున్న వాడిలా ఉక్కిరి బిక్కిరై పోతున్నాడు. ఆ సమయంలో హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది. ఆ బస్సు స్టాపు దగ్గర కెళితే... ఆ కుర్రాడు కనపడతాడేమో!

ఏమన్నా కొనుక్కోవడానికి కానీ సంపా సంపాదించిన చంటిపిల్లాడంత హుషారుగా నడిచాడు. తొందరగా అడుగులు రెండు వేసే సరికి జోడు యమయాతన పెట్టేసింది. కాలంతా ఉక్కిపోయి మంటపెట్టేస్తోంది. ఆరోజున ఆవిడెవరో కానీ ఇవ్వడం, వెంటనే వీడు కొనుక్కోవడం-అన్నీ కళ్ళముందు కదుల్తున్నాయి. త్వరగా వెళ్తే ఈవేళా చూడొచ్చు ఆ దృశ్యం.

ఎలాగో బస్సు స్టాపువచ్చింది. అడుగు కదపడానికి భయంవేస్తోంది. అంచేత అక్కడేనిలబడి నాలుగు వైపులాకలయ జూచాడు. ఆ అబ్బాయి లేడు. ఎక్కడికెళ్ళాడో. ఆ వేళటిటైము ఇంకా అవలేదు బహుశా ఆ టైముకే వస్తాడేమో. అంతవరకూ తను ఆగలేడు. ఆ మంచి క్షణం ఇకరాదు. పోనీ ఆ కుర్రాడేనా కనపడితే బాగుణ్ణు మళ్ళా చూశాడు ఆశతో. లేడు. నీరసంగా కూలబడిపోయాడు అక్కడొక రాతిపలకమీద. పాదం విపరీతంగా మంట పెట్టేస్తోంది. జోడు విప్పెయ్యాలి. బెల్టు ఊడదీశాడు. బూటు తీశే శాడు. కాలు బయటికివచ్చింది-నరాలన్నీ ఒక్కసారి విడ్డాయి. ఉక్కిపోయి, నొక్కుకుపోయిన కండరాలు బయటపడ్డాయి. ఉక్కిరిబిక్కిరి చేసే పొగ గదిలోంచి విశాలమైన సముద్రపు టంచు మీదికి వచ్చినంత హాయికలిగింది. ఏదోమనిషి నంతటినీ విశ్రాంతిపరిచే ఆనందం అది. హాయి... ఎంతో దివ్యమైన హాయి. కాలిమీద చల్లగా చెయ్యివేసి, ఎర్రబడ్డపాదాన్ని తడుముతున్నాడు; అన్నీ మరిచిపోయి ఆ హాయిలో కలిసిపోయి-...

ఈలవేసుకుంటూ ఆ పిల్లవాడు వచ్చేశాడు! అతనికి ప్రాణం లేచివచ్చింది. "వచ్చావా" అన్నాడు. వాడు తెల్లబోయి చూస్తున్నాడు.

"ఆ వేళ నీకుకానీ ఇచ్చిందే ఆ అమ్మాయి రాలేదా" అన్నాడు. లేదు-అన్నాడు కుర్రాడు బిక్కమొహంతో.

"పోనీలే-నే నిస్తానుకాని" అని జేబులోంచితీసి ఇచ్చాడు. అంతే. క్షణమేనా ఆగలేదు కుర్రాడు పరుగెట్టివెళ్ళి కిళ్ళీకొట్లో ఏదో కొనుక్కుని తింటున్నాడు.

అతను-ఆ కుర్రాడికేసి చూస్తున్నాడు. అలా.. మధ్యలో తన జోడుకేసి చూస్తున్నాడు. జోడు-కుర్రాడు. ఈ రెండే తనెప్పుడూ ఎరగని హాయినిచ్చినవి. అలా కుర్రాడికేసీ, జోడు కేసీ ఆప్యాయంగా చూస్తూ కూచున్నాడతను. ★